ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
5
కర్నూలు
జిల్లా వార్తలు
సోమవారం 22 జనవరి 2024





# టికెట్ నాదే..!

- బల్ల గుద్ది చెబుతున్న సిట్టింగ్ ఎమ్మెల్యే
- చివరికి వరకు పోరాటం ఆగదంటున్న గీతాశ్రీ, మద్దయ్య
- స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి సిద్ధమంటున్న మురళీకృష్ణ
- ఇప్పటికే సతీష్ పేరు ఖరారు చేసిన అధిష్టానం
- అభ్యర్థి మార్పు ఖాయమంటూ ప్రచారం
- మణిగాంధీపై రాజకీయం చేశారంటూ చర్చ
- కోడుమూరు వైసీపీలో గందరగోళం

కోడుమూరు, జనవరి 21:

**వైసీపీ విడుదల చేసిన మూడో జాబితాలో డాక్టర్ ఆదిమూలపు సతీష్‌ను కోడుమూరు ఇన్‌చార్జిగా ప్రకటించింది. అయితే ఇన్నాళ్లు పార్టీ కోసం పని చేసిన తమను కాదని మరొకరికి టికెట్ కేటాయిస్తే తమ భవిష్యత్తు ఏంటని మిగిలిన ఆశావహులు ప్రశ్నిస్తున్నారు. అధిష్టానం మరోసారి ఆలోచించాలని కోరుతున్నారు. లేదంటే తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమని హెచ్చరిస్తున్నారు. కోడుమూరు నియోజకవర్గంలో 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించింది. దీంతో ఈ సారి జరిగే ఎన్నికలకు వైసీపీలో ఆశావహుల సంఖ్య పెరిగిపోయింది. కోడుమూరు టిక్కెట్టు కోసం ఏడుగురు పోటీ పడ్డారు. తనకే టికెట్ వస్తుందని సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ఒక వైపు ప్రచారం చేసుకున్నారు. మరో వైపు టికెట్ తనకే అంటూ మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, మణిగాంధీ ధీమాతో మెలిగారు. ఇదే కోవలో సంధ్య విక్రమ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మదనగోపాల్ కూతురు గీతాశ్రీ, మద్దయ్య వంటి వ్యక్తులు కూడా తమకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకున్నారు. చివరకు అధిష్టానం డాక్టర్ ఆదిమూలపు సతీష్ పేరును ప్రకటించింది. అయితే మిగిలిన ఆశావహులు పట్టు వదలని విక్రమార్కుల వలే చివరి వరకు తమ పోరాటం ఆగదని చెబుతున్నారు.**

### అంతా స్వయంకృతాపరాధమే..

2019 సంవత్సరం ఎన్నికల్లో డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అనూహ్యంగా తెరపైకి వచ్చారు. నాడు రాష్ట్ర వ్యాప్తంగా వీచిన వైసీపీ గాలిలో గెలుపొందారు. అయితే ఎన్నికల్లో గెలిచిన వెంటనే వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డితో విభేదించి నియోజకవర్గంలో తన వర్గాన్ని బలోపేతం చేసుకోవాలని ప్రయత్నించారు. ఆలోచనకు తగ్గట్టుగా వ్యవహరించకుండా అనేక తప్పిదాలు చేశారు. మండల, గ్రామీణ స్థాయి నాయకులు, కార్యకర్తల ఫోన్లు ఎత్తకుండా నిర్లక్ష్యం చేశారు. ఇదే ఆయనకు శాపంగా మారింది. అత్యవసర సమయంలో కూడా ఫోన్ ఎత్తకపోవడంతో ఆయన కోసం పని చేసిన కార్యకర్తలు, నాయకులు విసిగెత్తిపోయారు. ఆయన ఇంటి ముందు గంటల తరబడి ఎదురు చూడటం, ఆయన సమయానికి వచ్చి కలవకపోవడం వంటి తప్పిదాలతో అందరిలో అసంతృప్తి నెలకొంది. ప్రజలు, కార్యకర్తల పట్ల ఎమ్మెల్యే అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఆయన వ్యతిరేక వర్గం అధిష్టానం ముందు పెట్టింది. అందువల్లే ఆయనకు టికెట్ రాకుండా పోయిందని ప్రచారంలో ఉంది.



డాక్టర్ సతీష్

### స్థానికులకే టికెట్టు ఇవ్వాలి..

స్థానికులకే టికెట్ ఇవ్వాలని సంధ్య విక్రమ్‌కుమార్ కోరుతున్నారు. వైసీపీ ఆవిర్భావం నుంచి ఈయన పార్టీలో కొనసాగుతున్నారు. రాబోయే ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. డాక్టర్ సతీష్‌కు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇవ్వడంపై పార్టీ మరో సారి ఆలోచించాలని అంటున్నారు. గూడూరు పట్టణంలో ప్రజా చైతన్య సభ సభ ఏర్పాటు చేసి స్థానికులకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



గీతాశ్రీ



మద్దయ్య



పరిగెల మురళీకృష్ణ

### మణిగాంధీపై రాజకీయం చేసిన వైసీపీ

మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ రాజకీయ భవిష్యత్తుపై వైసీపీ రాజకీయం చేసినట్టు తెలుస్తోంది. వైసీపీ టికెట్ ఇస్తామని చెప్పి తాడెపల్లికి పిలిపించి ఆయన వ్యవహార శైలిని వివరించి చీ కొట్టి పంపించారు. దీంతో ఆయన ఏ పార్టీ వైపు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. 2014 ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసి తన ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి అయిన మాదారపు రేణుకమ్మపై 52,382 ఓట్లతో గెలుపొంది అత్యధిక మెజారిటీలో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచాడు. అలాంటి మణిగాంధీ రాజకీయ భవిష్యత్తుపై వైసీపీ నమ్మించి దెబ్బ కొట్టిందన్న చర్చ జరుగుతోంది.



మణిగాంధీ

### పార్టీ టికెటు నాదే అంటుండడంతో అయోమయం

డాక్టర్ సతీష్ పేరును ఖరారు చేసిన తరువాత కూడా ఎమ్మెల్యే సుధాకర్ టికెట్ తనకే వస్తుందని తన అనుచర వర్గంతో అంటున్నట్లు తెలిసింది. ఇందులో ఎలాంటి అనుమానం అవసరం లేదని బల్లగుద్ది చెప్తున్నట్లు సమాచారం. నాన్ లోకల్ అయిన డాక్టర్ సతీష్‌కు కోడుమూరు రాజకీయం ఏం తెలుసన్న విషయాన్ని అధిష్టానం గుర్తించిందని, దీంతో పునరాలోచనలో పడిందని ఎమ్మెల్యే ప్రచారం చేసుకుంటున్నట్లు పార్టీ కార్యకర్తలే చర్చించుకుంటున్నారు. దీంతో వైసీపీ కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. పార్టీ ఆదేశాలు ధిక్కరించి ఎమ్మెల్యే మాట్లాడుతున్నాడని, ఈ విషయాన్ని పార్టీ దృష్టికి తీసుకెళ్లకపోతే తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయని డాక్టర్ సతీష్ వర్గీయులు ఆలోచిస్తున్నట్లు తెలిసింది.



జరదొడ్డి సుధాకర్

### స్వతంత్ర అభ్యర్థిగా పరిగెల మురళీకృష్ణ ?

వైసీపీకి ఎంతో విధేయుడిగా ఉన్న మురళీకృష్ణకు టికెట్ రాకుండా ప్రతి ఎన్నికల్లో ఎవరో ఒకరు అడ్డు పడుతున్నారు. 2019 ఎన్నికల ముందు మురళీకృష్ణకే టికెట్ అనే సమయంలో తెరపైకి డాక్టర్ జరదొడ్డి సుధాకర్ వచ్చారు. దీంతో మురళీకృష్ణ 2019 ఎన్నికల ముందు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న జగన్మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల్లో తగిన న్యాయం చేస్తానని మురళీకృష్ణను బుజ్జగించి తిరిగి రెండు రోజుల్లోనే వైసీపీలో చేర్చుకున్నారు. వైసీపీ గెలిచిన వెంటనే మురళీకష్ణకు టీటీడీ బోర్డు మెంబర్‌గా అవకాశం కల్పించారు. 2024 ఎన్నికల్లో టికెట్ వస్తుందని అనుకుంటున్న సమయంలో డాక్టర్ సతీష్ పేరు వినిపించడంతో మురళీకృష్ణ కూడా అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలోనే రాబోయే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని తన అనుచర వర్గం ఒత్తిడి తీసుకొచ్చిన్నట్లు తెలిసింది. త్వరలో తన అనుచర వర్గంతో సమావేశం ఏర్పాటు చేసుకొని రాబోయే ఎన్నికల్లో తన కార్యాచరణ ప్రకటించనున్నట్లు సమాచారం.

### ఒక వర్గానికికే ప్రాధాన్యత ఇస్తున్నాడని సతీష్‌పై గరం గరం

వైసీపీ అధిష్టానం డాక్టర్ సతీష్ ప్రకటించిన అనంతరం ఆయన కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి వర్గానికే ప్రాధాన్యత ఇస్తున్నాడని ఎమ్మెల్యే వర్గీయులు ఒక వైపు గరంగరంగా ఉన్నారు. అందులోనూ కుడా చైర్మన్ కోట్ల వర్గంలోని కొంత మందికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నాడని మరికొంత మంది డాక్టర్ సతీష్‌పై భగ్గుమంటున్నారు. కోట్ల హర్ష వర్గంలోని కొంత మందిని డాక్టర్ సతీష్ తన సొంత ఖర్చులతో తిరుమల తిరుపతికి తీసుకెళ్లి దగ్గర ఉండి దర్శనం చేయించారు. దీంతో అటు ఎమ్మెల్యే వర్గం, ఇటు కోట్ల హర్ష వర్గంలోని కొంత మంది డాక్టర్ సతీష్‌పై అసమ్మతితో రగిలిపోతున్నారు.

# మాటల్లోనే అభివృద్ధి

- కేంద్ర పథకాలకు వైసీపీ సర్కారు స్టిక్కర్లు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి



సమావేశంలో ప్రసంగిస్తున్న దగ్గుబాటి పురందేశ్వరి

**నంద్యాల (కల్చరల్), జనవరి 21:** రాష్ట్రంలో ఉన్నది మాటల ప్రభుత్వమే కాని చేతల ప్రభుత్వం కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఆదివారం నంద్యాల సౌజన్య ఫంక్షన్ హాలులో నిర్వహించిన పోలింగ్ బూత్ అధ్యక్షుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాల గురించి ప్రజలందరికీ వివరిస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం స్టిక్కర్ వేసుకొని ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. సోమవారం బలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దాదాపు అన్ని రాష్ట్రాలు సెలవు దినంగా ప్రకటిస్తే వైసీపీ ప్రభుత్వం ఇంతవరకు ప్రకటించలేదన్నారు. నంద్యాల జిల్లాకు ఒక్క పరిశ్రమ కూడా తీసుకు రాలేదని దుయ్యబట్టారు. కొలిమిగుండ్లలో ఉన్న సిమెంటు ఫ్యాక్టరీని అభివృద్ధి చేయలేదని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద భారతదేశంలో నాలుగు కోట్ల ఇళ్లు మంజూరైతే ఏపీకి 20 లక్షల ఇళ్లు ఇచ్చారని వివరించారు. బనగానపల్లెకు ఇంతవరకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదన్నారు. కొలిమిగుండ్లలో నాపరాతి పరిశ్రమలకు రాయల్టీని 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గిస్తామని చెప్పి పట్టించుకోలేదని విమర్శించారు. కుందూ నదిని ఆధునికీకరిస్తామన్నారని, ఇంతవరకు ఆ పని చేయలేదన్నారు. దీని వల్ల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బనగానపల్లె నియోజకవర్గంలో ఉన్న దద్దనాల ప్రాజెక్టును పట్టించుకోవడం లేదని తెలిపారు. కోవెలకుంట్ల మండలంలో జొలదరాశి ప్రాజెక్టు పనులు కూడా మొదలు పెట్టలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పేరుతో ప్రజలో ఆడుకుంటోందని మండిపడ్డారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు, జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి పాల్గొన్నారు.

# గడ్డి తింటూ అంగన్‌వాడీల నిరసన



కర్నూలులో నోట్లో గడ్డి పెట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

**కర్నూలు(హస్పిటల్), జనవరి 21:** నగరంలోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో గల దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు గడ్డి తింటూ నిరసన తెలిపారు. 41 రోజులుగా సమ్మె చేస్తున్నా సీఎం జగన్ పట్టించుకోకపోవడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, ఈ ధరలతో ఏంకొని.. ఏం తిని బతకాలని ప్రశ్నించారు. ఏఐటీయూసీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు పి.నిర్మల, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, ఎం.చంద్రయ్య సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ, జిల్లా గౌరవాధ్యక్షురాలు పి.నిర్మల మాట్లాడుతూ విజయవాడ ధర్నా చౌక్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న నాయకుల ఆరోగ్యం క్షీణించిందని, పోలీసులు బలవంతంగా హాస్పిటల్‌కు తరలించడం దారుణమన్నారు. ఇదంతా చూస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు వినబడడం లేదా అని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం ఇలాగే మొండిగా వ్యవహరిస్తే ఇంటికి సాగనంపక తప్పదని హెచ్చరించారు. సోమవారం లోపల అంగన్‌వాడీలు విధులకు హాజరు కావాలని సూపర్‌వైజర్లతో ఒత్తిడి తీసుకొచ్చి బెదిరిస్తున్నారని అన్నారు. కొత్త వారిని నియమిస్తామని చెప్పడంపై తీవ్రంగా మండిపడ్డారు. హైకోర్టులో పిటిషన్‌పై వాదనలు జరుగుతున్నాయని, కోర్టులో ఉన్న కేసు పరిష్కారం కాకుండా అంగన్‌వాడీలను తొలగిస్తామని చెప్పడం అవివేకానికి నిదర్శనమన్నారు. దీక్షల్లో ఓర్వకల్లు సెక్టార్‌కు చెందిన పి.లక్ష్మీదేవి, వరలక్ష్మి, నాగలక్ష్మి, భారతి, హేమలత, మహబూబ్‌బీ, సుశీలమ్మ, రాధమ్మ, రాజ్యలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, శివకుమారి, అనురాధ, తులసమ్మ, బి.భారతి, ఎల్.లక్ష్మీదేవి, చంద్రకళ దీక్షల్లో కూర్చున్నారు.

# శ్రీరామ పట్టాభిషేకం

### కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భారీ ఏర్పాట్లు



రామ నామం జపిస్తున్న బీజేపీ నాయకులు

**కర్నూలు(కల్చరల్) జనవరి 21:** అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం నగరంలో అయోధ్య రామునికి పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. పాత నగరంలోని జమ్మిచెట్టు సమీపంలోని లలితాపీఠంలో ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం, అనంతరం శోభాయాత్ర నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు జమ్మిచెట్టు నుంచి 15 అడుగుల శ్రీరాముని విగ్రహంతో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు శోభా యాత్ర నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 6.30 గంటలకు ధార్మిక ప్రవచనాలను ఏర్పాటు చేశారు. రాత్రి 7.30 గంటలకు శ్రీరామ పట్టాభిషేకాన్ని డాక్టర్ మామిళ్లపల్లి నాగఫణిశాస్త్రి బృందం నిర్వహిస్తుంది. దీని కోసం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏడు ద్వారాలతో కూడిన రామమందిరం ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో జి. పుల్లారెడ్డి తనయుడిని ఘనంగా సత్కరిస్తారు.



ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వేదిక



### సంఘ్ జాతీయ నేతలతో జిల్లాకు అనుబంధం



జి. పుల్లారెడ్డి, అశోక్ సింఘాల్‌తో నాటి వీహెచ్‌పీ జిల్లా నాయకుడు మల్లికార్జున రెడ్డి దంపతులు


అయోధ్యలో సోమవారం రామ మందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా కర్నూలు జిల్లా కేంద్రంలోని ఆలయాల్లో ఉత్సవాలను ఏర్పాటు చేశారు. అయోధ్యలో రామమందిరం నిర్మాణానికి పాటుపడిన సంఘ్‌పరివార్ జాతీయ నాయకులతో ఉమ్మడి కర్నూలు జిల్లాకు అనుబంధం ఉంది. అలాంటి నాయకుల్లో ఒకరైన జి.పుల్లారెడ్డి జిల్లాకు చెందినవారే. ఆయనకు జాతీయ నేతలతో ఉన్న అనుబంధం వల్ల విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు అశోక్ సింఘాల్ రెండు మూడుసార్లు ఆయన కర్నూలుకు వచ్చి జి. పుల్లారెడ్డితో వివిధ అంశాలను చర్చించినట్లు ఆనాటి వీహెచ్‌పీ నాయకుడు ఇ.మల్లికార్జున రెడ్డి గుర్తు చేసుకున్నారు. బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ దక్షిణ భారత రథయాత్రలో భాగంగా కర్నూలు మీదుగానే అనంతపురం వెళ్లారు. ఆయన వెంట ఆనాటి బీజేపీ నేత వెంకయ్య నాయుడు తదితరులు ఉన్నారు. వీహెచ్‌పీ జాతీయ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తొగాడియా కర్నూలులో నేటి వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిశెట్టి వెంకట్రామయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కర్నూలుకు వచ్చారు.

### అలరించిన 'పాటల పందిరి'



పాటలు పాడుతున్న గాయకులు సుధారాణి, శ్రీనివాసులు

ఆదివారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించిన అయోధ్య రాముని పాటల పందిరి కార్యక్రమం ప్రేక్షకులను అలరింపజేసింది. సాయి మెలోడీ2స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రామాయణ గాథను వివరించే అనేక సినిమాల్లోని పాటలను గాయకులు ఆలపించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహ్మద్ మియా ఇందులో పాల్గొన్నారు.



# పాణ్యంలో సీట్లాట

- కాటసాని వర్సెస్ బైరెడ్డి!
- టికెట్ కోసం అధిష్టానంపై సిద్ధార్థరెడ్డి ఒత్తిడి
- స్వతంత్రంగానైనా బరిలో దిగుతానని తేల్చి చెప్పిన కాటసాని
- మహిళా కోటా కింద రేణుక, శ్వేతారెడ్డి ప్రయత్నాలు

కర్నూలు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాణ్యం నియోజకవర్గం వైసీపీ టికెట్ కోసం ఆ పార్టీ నాయకులు పోటాపోటీగా ప్రయత్నిస్తున్నారు. దీంతో సీట్లాట ఆసక్తికరంగా మారింది. ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టాలని ఆరాటపడుతున్న వైసీపీ యువనేత, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి టికెట్ కోసం అధిష్టానంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. నందికొట్కూరు (ఎస్సీ) రిజర్వుడు నియోజకవర్గం టికెట్ మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామికి ఇవ్వాలని సిద్ధార్థరెడ్డి సూచించారు. కానీ కడప జిల్లాకు చెందిన డాక్టర్ సుధీర్‌కు సీఎం జగన్ టికెట్ ఇచ్చారు. దీనిని జీర్ణించుకోలేని బైరెడ్డి సిద్ధార్థరెడ్డి నందికొట్కూరులో తాను సూచించిన వ్యక్తికి టికెట్ ఇవ్వలేదని, కనీసం పాణ్యం నుంచి పోటీ చేసేందుకు తనకైనా అవకాశం ఇవ్వాలని ఒత్తిడి పెంచినట్లు సమాచారం. అయితే తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీ చేస్తానని అధిష్టానానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తేల్చి చెప్పినట్లు సమాచారం. అదే క్రమంలో అవకాశం ఉంటే తమకు చాన్స్ ఇవ్వాలని కర్నూలు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, ఎస్. శ్రీధర్‌రెడ్డి దంపతులు, కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి తెర వెనుక ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. మరో నాలుగైదు రోజుల్లో వైసీపీ అభ్యర్థుల ఐదో జాబితా రానున్న తరుణంలో పాణ్యం వైసీపీ సీట్లాట ఆసక్తికరంగా మారింది. ఏ ఇద్దరు కలసినా ఇదే చర్చ జరుగుతోంది.

### బైరెడ్డి సిద్ధార్థరెడ్డి తీవ్ర ప్రయత్నం


బైరెడ్డి సిద్ధార్థరెడ్డి 2019 ఎన్నికల ముందు వైసీపీలో చేరారు. ప్రత్యేక్ష రాజకీయాల్లో దూసుకుపోతూ ఆ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి ఆర్థర్ గెలుపు కోసం కృషి చేశారు. ఆర్థర్ ఎమ్మెల్యేగా గెలిచాక వారిద్దరి మధ్య రాజకీయ వర్గ విభేదాలు తీవ్ర స్థాయికి చేరాయి. ప్రస్తుతం ఎన్నికల్లో ఎమ్మెల్యే ఆర్థర్‌కు టికెట్ ఇవ్వకూడదని, తాను సూచించిన మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామికి ఇవ్వాలని తాడేపల్లి ప్యాలెస్ పెద్దలపై ఒత్తిడి తెచ్చారు. అయితే.. సిద్ధార్థకు సీఎం జగన్ షాక్ ఇచ్చి.. కడప జిల్లాకు చెందిన నాన్ లోకల్ డాక్టర్ సుధీర్‌కు టికెట్ ఇచ్చారు. నాలుగో జాబితాలో అధికారికంగా ప్రకటించారు. దీనిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి తనకు పాణ్యం టికెట్ ఇస్తే పార్టీ నుంచి ఎలాంటి ఫండ్ ఆశించకుండా ఎన్నికల ఖర్చు మొత్తం తానే భరిస్తానని సజ్జల, ధనుంజయరెడ్డి వంటి వారి ముందు ప్రతిపాదన పెట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అలాగే.. పాణ్యం వైసీపీ అభ్యర్థి సిద్ధార్థరెడ్డే అంటూ ఆయన వర్గీయులు, అనుచరులు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్యే కాటసానికి టికెట్ ఇస్తే గెలిచే అవకాశాలు లేవని సర్వేలు చెబుతున్నాయి. అందువల్ల కూడా తనకు చాన్స్ ఇవ్వాలని బైరెడ్డి తాడేపల్లి ప్యాలెస్‌కు ఇప్పటికే రెండుమూడు పర్యాయాలు వెళ్లి గట్టిగా ప్రయత్నించినట్లు సమాచారం. అయితే ఈ విషయంపై ఆంధ్రజ్యోతి ఆరా తీస్తే.. నందికొట్కూరులో ఇంటి స్థలాల విషయం చర్చించానిని పేర్కొనడం కొసమెరుపు.



### ధీమా ఉన్నా.. లోలోన భయమే !

పాణ్యం వైసీపీ టికెట్ తనకు కాక మరెవరికి ఇస్తారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ధీమాగా ఉన్నారు. అయితే నాయకుల ఊహలకు అందని విధంగా సీఎం జగన్ ఎమ్మిగనూరులో మాచాని వెంకటేశ్, నందికొట్కూరులో నాన్ లోకల్ అయిన డాక్టర్ సుధీర్, కోడుమూరులో నాన్ లోకల్ అయిన డాక్టర్ ఆదిమూలపు సతీశ్‌లకు టికెట్ ఇచ్చారు. పాణ్యం టికెట్ కాటసాని ఇస్తారా..? ఐప్యాక్ సర్వే పేరుతో కొత్తవారిని బరిలో దింపుతారా..? దీనిపై కాటసాని వర్గీయులు లోలోన ఆందోళన చెందుతున్నారు. కాగా.. ఐప్యాక్ సర్వేలో బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఈ దఫా నంద్యాల ఎంపీగా వెళ్లాలని వైసీపీ పెద్దలు కాటసాని రాంభూపాల్‌రెడ్డితో చర్చించినట్లు సమాచారం. అదే క్రమంలో పాణ్యం నియోజకవర్గంలో కూడా సర్వే ఫలితాలు ప్రతికూలంగా ఉన్నాయని కాటసానికి సూచించినట్లు తెలుస్తోంది. అయితే.. 1985 నుంచి 2019 వరకు పాణ్యం నియోజకవర్గం నుంచి తొమ్మిది పర్యాయాలు పోటీ చేస్తే ఆరు పర్యాయాలు కాటసాని గెలిచారు. 2014లో స్వతంత్రంగా పోటీ చేసి 60,598 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. అందువల్ల తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర్యంగా అయినా పోటీ చేస్తాగాని పాణ్యం వదిలే ప్రసక్తే లేదని ఆయన వైసీపీ పెద్దలకు తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో రాబోయే ఐదో జాబితాలో కాటసాని పేరు ఉంటుందా..? మరో వ్యక్తి తెరపైకి వస్తారా..? అని కాటసాని వర్గీయులు లోలోన ఆందోళనపడుతున్నప్పటికీ టికెట్‌పై మాత్రం ధీమాగానే ఉన్నారు.

### పోటీలో మేము సైతం..



వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డితో గాజుల శ్వేతారెడ్డి

పాణ్యం టికెట్ కోసం ఓ వైపు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్యే కాటసానిల మధ్య కోల్డ్‌వార్ జరుగుతుండగా.. ఈసారి తమకు అవకాశం ఇవ్వాలని కర్నూలు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, ఆమె భర్త ఎస్.శ్రీధర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. టికెట్ ఇస్తే ఖర్చు మొత్తం తామే భరిస్తామని కూడా జిల్లాలో వైసీపీ రాజకీయ వ్యవహారాలు చూస్తున్న కడప జిల్లాకు చెందిన ఓ ముఖ్య నాయకుడి ద్వారా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అలాగే.. వైసీపీలో ఎంపీ విజయసాయిరెడ్డికి సమీప బంధువు అయిన కర్నూలు, నంద్యాల, అన్నమయ్య జిల్లాల వైసీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి, 41వ వార్డు కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి కూడా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈమె భర్త జి. కవినాథ్‌రెడ్డి పారిశ్రామికవేత కావడం, వైసీపీ పెద్దలతో సన్నిహిత సంబధాలు ఉండడంతో శ్వేతారెడ్డి గట్టిగానే ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. మహిళా కోటా కింద అవకాశం ఇవ్వాల్సి వస్తే తనను పరిగణలోకి తీసుకోవాలని డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి అధి నాయకత్వం వద్ద ప్రయత్నిస్తున్నారు. ఇటీవల జరిగిన సామాజిక సాధికార యాత్ర సందర్భంగా వేదికకు ఎదురుగా ఓ కార్యకర్త చేతిలోని గాజుల శ్వేతారెడ్డి ఫ్లకార్డును కాటసాని వర్గీయులు తీసేయడం చర్చనీయాశంగా మారింది. ఆమె టికెట్ కోసం ప్రయత్నిస్తున్నందు వల్లే ఫ్లకార్డు తొలించారనే ఆరోపణలు లేకపోలేదు.



సిద్ధారెడ్డి రేణుక

---

## జరిమానాలు రద్దు చేయాలి

- రోడ్లు విస్తరించాలి
- పీపీఎస్ఎస్ అధ్వర్యంలో ఫొటో ఎగ్జిబిషన్



ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య

**కర్నూలు(న్యూసిటీ), జనవరి 21:** నగరంలో సెన్సార్ కెమెరాలతో జరిమానా వేసే పద్ధతిని తక్షణమే రద్దు చేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి అన్నారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్వర్యంలో ఆదివారం బీఏఎస్ కళ్యాణమండపంలో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు, ఇబ్బందులపై ఏర్పాటు చేసి ఎగ్జిబిషన్‌ను రవీంద్ర విద్యా సంస్థల అధినేత పుల్లయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగుల నాయకుడు యాకోబు అధ్యక్షతన జరిగిన చర్చా వేదికలో పలువురు వక్తలు సెన్సార్ కెమెరాల ఏర్పాటుపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో సెన్సార్ కెమెరాలను ఏర్పాటు చేసి ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనదారులకు జరిమానాలు విధిస్తూ ప్రభుత్వం కోట్లాది రూపాయలు దండుకుంటోందని అన్నారు. నగరంలో రోడ్లు విస్తరించకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పీపీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి, సభ్యులు నౌషద్, కళాకారుల సంఘం నాయకులు రమణారెడ్డి, నాయకులు ఎం.నాగరాజు, సివి. వర్మ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీని ఇంటికి పంపిస్తేనే అభివృద్ధి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు



**కర్నూలు(అర్బన్), జనవరి 21:** వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం జగన్‌రెడ్డి అనే నియంతకు అధికారం ఇచ్చి.. అయన ఆనాలోచిత, పిచ్చి నిర్ణయాలతో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. టీడీపీకి వచ్చే ఎన్నికల్లో అధికారం ఇస్తే సూపర్ సిక్స్ పథకాల ద్వారా అన్ని వర్గాలను ఆదుకుంటుందన్నారు. గతంలో రూ. 200 ఉన్న పింఛన్ తెలుగుదేశం ప్రభుత్వం రూ 2వేలకు పెంచి పేదలకు అందించిందన్నారు. ఒకప్పుడు నాణ్యమైన మద్యం క్వార్టర్ రూ. 70 ఉంటే ఇప్పుడు రూ. 270 చేశారని, మద్య నిషేధం చేశాకే ఓటు అడుగుతానని చెప్పిన జగన్ తెచ్చిన కల్తీమద్యం తాగి 35 లక్షల మంది అనారోగ్యం పాలయ్యారని అన్నారు. 30వేల మంది మరణించారని తెలిపారు. పింఛన్ 3వేలు పెంచుతానని చెప్పి కేవలం 250 పెంచి మోసం చేశారని అన్నారు. రాష్ట్రం కోసం, ప్రజల కోసం తపించే తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని అన్నారు.

## రూ.50పై బాల రాముడు




రూ.50ల నోటు పై చిత్రీకరించిన బాలరాముడి చిత్రం

**ఆదోని, జనవరి 21** : ఆదోని మండలం, నారాయణపురం గ్రామానికి చెందిన మల్లికార్జున రూ.50 నోటుపై బాలరాముడి చిత్రం వేసి శభాష్ అనిపించుకున్నాడు. ఈనెల 22వ తేదీన అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ఆయన ఈ చిత్రాన్ని వేశారు. మల్లికార్జున ఆలూరు మండలం, కమ్మరచెడు హైస్కూల్‌లో కాంట్రాక్టు పద్ధతిన డ్రాయింగ్ మాస్టర్‌గా పని చేస్తున్నారు.

## వీడిన హత్య కేసుల మిస్టరీ



విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

**పత్తికొండ, జనవరి 21 :** భార్య కాపురానికి రావడం లేదన్న మానసిక వేదనతో సైకోగా మారిన ఓ వ్యక్తి హత్యలకు తెగబడ్డాడు. ఇందుకు సంబంధించిన వివరాలను పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వెల్దుర్తి మండలం చెరుకులపాడు గ్రామానికి చెందిన వెంకటన్న కుమారుడు మాసెపోగు మాదెన్న కర్నూలు సిల్వర్‌జూబ్లీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదివి మానేశాడు. ఆ తరువాత ఇతడికి తుగ్గలి మండలం మారెళ్లకు చెందిన జయమ్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం. సంతానం కలిగిన తర్వాత భర్త మానసిక పరిస్థితిలో మార్పు రావడంతో జయమ్మ పిల్లలను తీసుకుని పుట్టింటికి చేరుకుంది. అయితే కాపురానికి రావాలంటూ మాదెన్న భార్య వద్దకు వచ్చేవాడు. మానసిక స్థితి సరిగాలేని అతనితో ఆమె కలిసి బతకడానికి నిరాకరించేది. దీంతో మాదెన్న చెరుకులపాడు నుంచి అప్పుడప్పుడు వచ్చి భార్యా పిల్లలను కలిసి వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో తనలాగే మానసిక స్థితిసరిగా లేక కుటుంబం నుంచి దూరమైన వారిని హత్య చేస్తే తన భార్య ఇంటికి రానిస్తుందని ఆలోచన చేశాడు. అందుకోసం భార్య జీవిస్తున్న మారెళ్ల గ్రామ సమీపంలో ఆర్ఎస్ పెండేకల్ స్టేషన్‌ను అనువైన ప్రాంతంగా ఎంచుకున్నాడు. గత ఏడాది మార్చిలో స్టేషన్ ఆవరణలో నిద్రిస్తున్న మతిస్థిమితం లేని గుర్తుతెలియని వ్యక్తి తలపై రాయితో బాది హత్య చేశాడు. అయితే హత్యకు సంబంధించిన ఆనవాళ్లు తెలియకపోవడంతో పోలీసులు కేసు విచారణను నిలిపివేశారు. ఆ తరువాత ఈ నెల 6న

### నిందితుడు సైకో అని గుర్తించిన పోలీసులు

తుగ్గలి మండల పరిధిలోని ఆర్ఎస్ పెండేకల్ రైల్వేస్టేషన్ సమీపంలో మతిస్థిమితం లేని పూజారి రాము (57) హత్యకు గురయ్యాడు. రైల్వేస్టేషన్ సమీపంలో నిద్రిస్తున్న మతిస్థిమితం లేని పూజారి రామును రాయితో తలపై బాది హత్య చేశాడు. ఈ హత్య స్థానికంగా సంచలనం కలిగించింది. రాము ఎమ్మెల్సీ సునీతకు స్వయాన అన్న కావడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ రెండు హత్యలు ఒకే తరహాలో ఉండడంతో హంతకుడు సైకో అయి ఉంటాడన్న కోణంలో పోలీసులు విచారణ ప్రారంభించారు. హత్య జరిగిన సమయంలో ఆర్ఎస్ పెండేకల్ గ్రామంలోని ఓ సీసీ పుటేజీ, మారెళ్ల గ్రామంలోని సీసీ పుటేజీలలో ఒకే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో ఆ వ్యక్తి వివరాల సేకరించారు. చెరుకులపాడుకు చెందిన మాదెన్నగా గుర్తించి అతని కోసం గాలింపు చేపట్టారు. దీంతో పోలీసులు తనను అరెస్టు చేయడం ఖాయమని తెలుసుకున్న మాదన్న ఎద్దులదొడ్డి వీఆర్‌వో కాశీంరంగస్వామి వద్ద లొంగిపోయాడు. తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున సిబ్బందితో వెళ్లి మాదన్నను అరెస్టు చేశారు. నిందితునిపై రెండు హత్యలకు సంబంధించిన కేసులు నమోదు చేశామని రిమాండ్‌కు తరలిస్తామని డీఎస్పీ తెలిపారు. హత్య కేసు మిస్టరీని ఛేదించినందుకు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ మల్లికార్జునతోపాటు సిబ్బందికి ఎస్పీ రివార్డు ప్రకటించారు.



## వైసీపీని ఇంటికి పంపిస్తేనే రాష్ట్రం అభివృద్ధి

నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు రాజశేఖర్



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

**ఓర్వకల్లు, జనవరి 21:** వైసీపీ ఇంటికి వెళితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఆదాయం పెరగలేదని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కూడా రాలేదఇ అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలపై బాదుడే బాదుడన్నారు. సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ తోఫాలను ఏమయ్యాయని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో నాణ్యమైన మద్యం సరఫరా చేశామని, వైసీపీ అధికారంలో నాసిరకం కల్తీ మందులు విక్ర యిస్తూ పేదల జీవితాలను నాశనం చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పైసా కూడా కరెంటు చార్జీలు పెంచలేదన్నారు. వైసీపీ పాలనలో నష్టపోయింది బడుగు, బలహీన వర్గాల ప్రజలేనన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక భూరక్షణ చట్టం బదిలీ చేస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టును గత టీడీపీ ప్రభుత్వం 75 శాతం పూర్తి చేస్తే.. జగన్ రెడ్డి ఈ ప్రాజెక్టును నాశనం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు బజారు, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## వీరశైవులను ఓబీసీలుగా గుర్తించాలి

లింగాయత్ మహా సభ రాష్ట్ర అధ్యక్షుడు దండిన శివానంద రావు

**ఆదోని టౌన్, జనవరి 21 :** రాష్ట్రంలో 9.75 లక్షల జనాభా ఉన్న వీరశైవులను ఓబీసీలుగా గుర్తించాలని అఖిల భారత వీరశైవ లింగాయత్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు దండిన శివానంద రావు, వీరశైవ సమాజ సేవా సంఘం పట్టణ అధ్యక్షుడు గూళ్యం శివరుద్రప్ప అన్నారు. ఆదివారం వీరు విలేఖరులతో మాట్లాడుతూ ప్రస్తుతం బీసీ-డీగా ఉన్న తమను ఓబీసీలుగా గుర్తించాలని, చాలా కాలంగా కోరుతున్నామని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. ఈ నెల 25న ఆదోనిలో పురస్కారాలను అందజేసే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి కేఎం మల్లికార్జున స్వామి, రాష్ట్ర కార్యదర్శి దేశాయ్ చంద్రన్న, ఈసీ మెంబర్ శరణ బసప్ప, రమేష్, విశ్వనాథ్, మహేష్ కుమార్, నాగేంద్ర పాల్గొన్నారు.

## రూ.కోటి నగదుతో పట్టుబడ్డ వ్యక్తి

- రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తుండగా బయటపడ్డ డబ్బు
- అరెస్టు చేసిన రైల్వే పోలీసులు



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న పోలీసులు

**ఆదోని, జనవరి 21 :** ఆదోనిలో ఆదివారం అర్ధరాత్రి రైలులో రూ.కోటి అక్రమ నగదుతో ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. రైల్వే పోలీసులు ప్లాట్‌ఫారం నెం-1లో తనిఖీ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి తడబడుతూ డబ్బు ఉన్న బ్యాగుతో అటూ, ఇటూ తిరుగుతుండటం గమనించిన పోలీసులకు అనుమానం వచ్చి అతని వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేశారు. అందులో భారీగా నగదు కనిపించింది. ఆదోని పట్టణం హవన్నపేటకు చెందిన కోల్కర్ మహమ్మద్ హైదరాబాద్ బేగంపేట నుంచి ఆదోనికి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ (12794)లో అక్రమంగా డబ్బు తీసుకొని వచ్చాడు. ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంటకు ఆదోని రైల్వే స్టేషన్‌లో నిందితుడు దిగాడు. ఆ డబ్బుకు సంబంధించిన ఎలాంటి రసీదులు, వివరాలు లేకపోవడంతో ఆదోని రైల్వే ఆర్‌పీఎఫ్ ఎస్సైలు గోపాల్, రామస్వామి, లక్ష్మణ్, హెడ్ కానిస్టేబుల్ సర్వేశ్వర స్వామి, పరశురాముడు, శివరామయ్య, శేక్షావలి నగదు స్వాధీనం చేసుకున్నారు. వ్యక్తిని అరెస్టు చేశారు. నగదుకు ఆధారాలు లేకపోవడంతో తదుపరి చర్యలు నిమిత్తం ఆదాయపు పన్ను శాఖకు అప్పగించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ తెలిపారు.

## ఘనంగా గానాల రామ్మూర్తి జయంతి

**కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 21:** స్థానిక బీ క్యాంపులోని బీసీ భవన్‌లో ఆదివారం ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసన మండలి సభ్యుడు రాము సాహెబ్ పండిత గానాల రామ్మూర్తి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైసీపీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి దేవపూ జ ధనుం జయాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సుమంత్ ఆచారి, రాఘవాచారి, వేంపెంట రాంబాబు, కృష్ణవేణమ్మ పాల్గొన్నారు.

## ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

● హైకోర్టు న్యాయవాది బి. సూర్యనారాయణ

**కర్నూలు(న్యూసిటీ), జనవరి 21:** వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం కోసం భవిష్యత్తులో అన్ని వాల్మీకి సంఘాలను కలుపుకుని ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని హైకోర్టు న్యాయవాది బి.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం సూరజ్ గ్రాండ్ హోటల్ సమావేశ భవనంలో ఎస్టీ పునరుద్ధరణ వాల్మీకి సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటాలు సాగించాలన్నారు. సమావేశంలో నాయకులు మద్దిలేటి, బాలవెంకటేశ్వర్లు, వలసల రామక్రిష్ణ, ఇంద్రాణి, పెద్దపాదు వెంకటరమణ పాల్గొన్నారు.

## దోమల నివారణకు చర్యలు

**కర్నూలు(న్యూసిటీ), జనవరి 21:** నగరంలో దోమలను నియంత్రించేందుకు నగర పాలక సంస్థ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం నగరంలోని కేసి కెనాల్లో దోమల నివారణ కోసం సీనియర్ ఎంటమాలజిస్టు వెంకటేశ్వరు అధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజులు పరిశీలించారు. ఎంహెచ్‌ఓ మాట్లాడుతూ హంద్రీ నది పరివాహర ప్రాంతాలలో దోమల నివారణ కోసం ప్రత్యేక యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు కూడా తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు.

## శాంతిభద్రతలకు ఆటంకం కలిగించవద్దు

**ఓర్వకల్లు, జనవరి 21:** అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా శాంతిభద్రతలకు ఆటంకం కలిగించవద్దని ఎస్ఐ రాజారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం అయోధ్య శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో మతకలహాలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అయోధ్య కరపత్రాలు, జెండాల పంపిణీ


బ్రాహ్మణపల్లెలో అయోధ్య కరపత్రాలు, జెండాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

**ఓర్వకల్లు, జనవరి 21:** మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు నిర్వాహకులు నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ఓర్వకల్లు, బ్రాహ్మణపల్లె, శకునాల, కాల్వ, నన్నూరు, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు తదితర గ్రామాల్లో అయోధ్యలో నిర్మిస్తున్న నూతన బలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు సంబంధించిన కరపత్రాలు, ఇంటిపై ఎగురవేయడానికి హనుమాన్‌చాలీసా జెండాను ఇంటింటికి పంపిణీ చేశారు. అలాగే సోమవారం మండలంలోని ఓర్వకల్లు కన్నమడకల, పూడిచెర్ల, హుశేనాపురం తదితర గ్రామాల్లో శ్రీరాముని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కార్యక్రమంలో కాల్వబుగ్గ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ విద్యార్థులు పోటీ పడి చదవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంప్లాయ్‌మెంట్ అధికారి

**కర్నూలు(అర్బన్), జనవరి 21:** ఓపెన్ స్కూల్ విద్యార్థులు రెగ్యులర్ విద్యార్థులతో పోటీ పడి చదవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి పి. దీప్తి అన్నారు. ఆదివారం నగరంలోని కొత్తబస్టాండ్ సమీపంలో ఉన్న సీతారామ్ నర్సింగ్ కళాశాలలో మేఘనా ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో జిల్లా ఉపాధి కార్యాలయంలో తమ వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఎక్కడెక్కడ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయో తెలుసుకోవడానికి తమ వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ ఉండాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరీక్షల పరిశీలనాధికారి చంద్రభూషన్ రాబు మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ విద్యార్థులు నిర్లక్ష్యం వీడి, పోరాట పటిమ ప్రదర్శించాలని కోరారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులకు అన్ని ప్రభుత్వ ఉద్యోగాలల్లో అవకాశాలున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు విజయకుమార్, జీవనజ్యోతి, రహమాన్, బషీర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీపీఎం సభ్యుడు వెంకటేశ్వర్లు మృతి

**కర్నూలు(రూరల్)జనవరి 21:** కర్నూలు రూరల్ మండలం గొందిపర్ల గ్రామంలో సీపీఎం సభ్యుడు బి. వెంకటేశ్వర్లు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కెవి. నారాయణ వెళ్లి వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలతో నివాళర్పించారు.

## కుల గణనను వేగవంతం చేయాలి

**సి. బెళగల్, జనవరి 21:** మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, బురాన్‌దొడ్డి, బ్యాతోళి, క్రిష్ణదొడ్డి, గొల్లలదొడ్డి గ్రామాలలో చేపట్టిన కులగణనను వేగవంతం చేయాలని తహసీల్దార్ శేషఫణి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం తహసీల్దార్ శేషఫణి మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించాలన్నారు. గ్రామాల నుంచి వలస వెళ్లిన వారిని ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవాలన్నారు.

## సీటీ స్కాన్ కోసం బంధువుల అవస్థలు


వృద్ధురాలిని సీటీ స్కాన్ కోసం స్ట్రెచర్‌పై తీసుకువస్తున్న బంధువులు

**కర్నూలు(హాస్పిటల్), జనవరి 21:** ఈ ఫొటోలో కనిపిస్తున్న ఓ వృద్ధురాలిని సర్జరీ వార్డులో చేర్పించారు. వైద్యులు సీటీ స్కాన్ పరీక్ష రాసివ్వడంతో ఈ పరీక్ష కోసం కర్నూలు జీజీహెచ్ న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌కు వెళ్లాలని చెప్పారు. దీంతో రోగి బంధువులు స్ట్రెచర్ కోసం సిబ్బందిని అడుగగా రూ.200 ఇస్తే పరీక్షకు తీసుకెళ్తామన్నారు. ఈ రోజు ఆదివారం తమకు డ్యూటీలు ఉండవని చెప్పారు. దీంతో చేసేదేమీ లేక వృద్ధురాలిని స్ట్రెచర్‌పై బంధువులు న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌కు తీసుకువచ్చారు.

# అంతా రామమయం

● ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పూర్తి
● రాంబొట్ల ఆలయంలో ప్రత్యేక పూజలు

అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం నగరంలో అయోధ్య రామునికి పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. అలాగే రాంబొట్ల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు తెలిపారు. సోమవారం పాతబస్తీలోని ఆలయంలో ఉదయం 8 గంటలకు సీతా రామచంద్రుల వారి మూల విగ్రహాల అభిషేకం, 9 గంటలకు పవమానసహిత శాంతి హోమక్రతువులు, 10 గంటలకు శ్రీరామనామభజనలు, 11 గంటలకు సీతా రామచంద్రుడి ధార్మిక విశేష ప్రవచనాలు, అయోధ్య బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం, 12 గంటలకు ప్రత్యక్ష ప్రసారం, ఒంటి గంటకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఉంటుందని అన్నారు.

- కర్నూలు(అర్బన్), కర్నూలు (కల్చరల్)


అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వేదిక





ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆకట్టుకుంటున్న వివిధ రూపాల్లోని విగ్రహాలు

# టీడీపీని గెలిపిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు

● బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారంటీలో గౌరు దంపతులు


కర పత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గౌరు దంపతులు

**కల్లూరు, జనవరి 21:** ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న వైసీపీ పాలనకు స్వస్తిచెప్పి రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపిస్తేనే రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తు ఉంటుందని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం 21వ వార్డు హౌసింగ్ బోర్డు, మహాలక్ష్మీనగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీలో భాగంగా ఆమె కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరు దంపతులు మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. పాదయాత్రలో ఇచ్చిన ఒక్కహామీ కూడా నెరవేర్చ లేదన్నారు. అభివృద్ధి లేకపోగా రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రగా మార్చారని, అన్నివర్గాల ప్రజలు ఆందోళనబాట పడుతున్న విషయాన్ని గౌరుచరిత గుర్తుచేశారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, ప్రతి ఇంటికీ టీడీపీ మ్యానిఫెస్టో చేరేలా కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కల్లూరు అర్బన్ 16 వార్డుల అధ్యక్షుడు, కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, కల్లూరు మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు ఎవీ. రామకృష్ణ, రాఘవేంద్రారెడ్డి, విశ్వనాథ్, లలితమ్మ, ఎస్సీ సెల్ నాయకులు బాబురాజు తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీని గెలిపించండి: గౌరు దంపతులు

నాలుగున్నరేళ్ళుగా నిరంకుశ పాలన కొనసాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపి టీడీపీని అధికారంలోకి తేవాలని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జ్ గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం తమ స్వగృహంలో గౌరు దంపతులు విలేఖరులతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అసమర్థ సీఎం జగన్‌ను గద్దెదించాలని పిలుపునిచ్చారు.

## టీడీపీ జెండా ఎగరవేస్తాం

● యువ నాయకుడు బొగ్గుల దస్తగిరి


దిన్నెదేవరపాడులో టీడీపీ మేనిఫెస్టోపై ప్రజలకు వివరిస్తున్న దస్తగిరి

**కర్నూలు(రూరల్), జనవరి 21:** సార్వత్రిక ఎన్నికల్లో కోడుమూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగరవేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ యువ నాయకుడు బొగ్గుల దస్తగిరి ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ఆదివారం కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడు, శిల్పటౌన్‌షిప్, అంబేడ్కర్ నగర్, టీజీవీ నగర్, ప్రాంతాల్లో స్థానిక టీడీపీ నాయకులతో కలిసి దస్తగిరి ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అంధకారంలోకి నెట్టిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, సర్పంచు మాధవస్వామి, తాండ్రపాడు ఎంపీటీసీ మద్దిలేటి, స్థానిక నాయకులు చిత్రసేనుడు, ప్రతాప్, గోపి, బంగారం, సర్వేశ్వరరెడ్డి, కృష్ణబాబు పాల్గొన్నారు.

## ఈ-తాండ్రపాడులో వాలీబాల్ పోటీలు

**కర్నూలు(రూరల్), జనవరి 21:** కర్నూలు రూరల్ మండలం ఈ-తాండ్రపాడు గ్రామంలో ఆదివారం సాయంత్రం మండల స్థాయి వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు మొత్తం 16 టీములు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి టీడీపీ ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.కిరణ్బాయి ముఖ్యఅతిథిగా హాజరై గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతిగా రూ.20వేలు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు యువత మాజీ అధ్యక్షుడు జయకృష్ణ, నాయకులు పూర్ణచంద్రరావు, గౌరి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కె.మార్కాపురంలో ఇళ్ల పట్టాల పంపిణీ

**కల్లూరు, జనవరి 21:** పాణ్యం నియోజకవర్గంలోని కె.మార్కాపురం గ్రామంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రజలు ఇళ్ల పట్టాలను ఆదివారం పంపిణీ చేశారు. గ్రామంలో 112 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దారు టీవీ రమేష్‌బాబు, ఎంపీపీ బి.శారద, సర్పంచు ఘనమద్దిలేటి, ఎస్.శ్రీధర్‌రెడ్డి, దండు లక్ష్మీకాంతరెడ్డి, కల్లా వెంకటరమణారెడ్డి, మండల అధ్యక్షుడు పెద్దఈశ్వరయ్య, ఉలిందకొండ రమణారెడ్డి పాల్గొన్నారు.

## కోడి కత్తి కేసులో శ్రీనుకు బెయిల్ ఇవ్వాలి

**కల్లూరు, జనవరి 21:** కోడి కత్తి కేసులో శ్రీనుకు బెయిల్ రాకుండా సీఎం జగన్ దళిత కుటుంబాన్ని క్షోభకు గురి చేస్తున్నాడని నంద్యాల, కర్నూలు జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు కె.పార్వతమ్మ, ఎస్.ముంతాజ్‌బేగం అన్నారు. ఆదివారం వీకర్ సెక్షన్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో చేపట్టిన సమావేశంలో జగన్‌రెడ్డి స్వార్థ రాజకీయాలపై దుమ్మెత్తి పోశారు. ఈ సందర్భంగా కె.పార్వతమ్మ మాట్లాడుతూ కోడి కత్తి దాడి కేసులో జగన్ కోర్టుకు హాజరు కాకుండా దళిత బిడ్డ శీను జీవితాన్ని నాశనం చేస్తున్నారని విమర్శించారు. న్యాయం కోసం దీక్ష చేస్తున్న కుటుంబ సభ్యులను లాగిపడేశారని, ఇప్పటికైనా కోడి కత్తి శీనుకు బెయిల్ వచ్చేలా సీఎం వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలు అరెస్టు

**కర్నూలు, జనవరి 21:** అంగన్‌వాడీ వర్కర్లు ఛలో విజయవాడ పిలుపు నేపథ్యంలో పోలీసులు వారిని ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 500 మందికి పైగా అంగన్‌వాడీ కార్యకర్తలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ విజయవాడలో చేపట్టిన నిరవధిక దీక్షలకు మద్దతుగా సోమవారం కోటి సంతకాలతో జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఛలో విజయవాడకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో కర్నూలు నగరంలో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో సంబంధిత సీపీఎం, సీఐటీయూ నాయకులు, 30 మందికి పైగా అంగన్‌వాడీ వర్కర్లను అరెస్టు చేసి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. నిర్మల, మహ్మద్ రఫీ, విజయ్ తదితరులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు సుధాకరప్పకు నాలుగో పట్టణ పోలీసులు నోటీసులు జారీ చేశారు.

## వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


టీడీపీలో చేరుతున్న నాయకులు, కార్యకర్తలతో టీజీ భరత్

**కర్నూలు(అర్బన్), జనవరి 21:** నగరంలోని 6 వార్డులోని వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. ఆదివారం నగరంలోని మౌర్యఇన్‌లో షాకిర్, ఫైరోజ్, రజాక్‌ల ఆధ్వర్యంలో టీడీపీ కర్నూలు ఇంచార్జీ టీజీ భరత్ కండువా కప్పి ఆహ్వానించారు. టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలు అభివృద్ధి చేసే నాయకుడిని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలన్నారు. అధికారం ఉన్నా.. లేకున్నా టీజీ కుటుంబం ప్రజా సేవ చేస్తూనే ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జహంగీర్ బాషా, ఇబ్రహీం, మోహబూబ్, గౌస్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఓటర్ల తుది జాబితాను పకడ్బందీగా రూపొందించాలి

**కర్నూలు (కలెక్టరేట్), జనవరి 21:** బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు తుది ఓటర్ల జాబితాను పకడ్బందీగా రూపొందించాలని జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు మురళీధర్ రెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓటర్ల తుది జాబితా ప్రచురణపై ఈఆర్ఓ, ఏఈఆర్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం సోమవారం ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తామన్నారు. రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి రెండు సెట్ల ఓటర్ల జాబితా ను వారికి అందజేయాలని కలెక్టర్‌కు సూచించారు. నాలుగు కంటే ఎక్కువ పోలింగ్ స్టేషన్లు ఉన్న అర్బన్, రూరల్ ప్రాంతాలలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గోదా రంగనాథస్వాముల కల్యాణం


గోదా రంగనాథ స్వాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

**కర్నూలు (కల్చరల్), జనవరి 21:** నగర శివారు మామిదాలపాడులోని శ్రీ గోదా రంగనాథ స్వామి దేవాలయంలో ఆదివారం శ్రీ గోదా రంగనాథస్వాముల కల్యాణోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. విజయవాడకు చెందిన త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో, ఆలయానికి చెందిన వేదపండితులు శాస్త్రోక్తంగా, వేద మంత్రోచ్చారణ మధ్య కల్యాణ వేడుకలను చేపట్టారు. జీయర్ స్వామి మాట్లాడుతూ గోకులంలో జరుగుతున్న కల్యాణ వేడుకలను తిలకించేందుకు ఆకాశంలో గరుడ పక్షులు రావడం ప్రత్యేక విశేషమని చెప్పారు. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టు పల్లెర్ల నాగరాజు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

# సోషలిస్టు రాజ్యాన్ని నిర్మించిన మహా నేత లెనిన్

● ఘనంగా లెనిన్ శత వర్ధంతి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

**కర్నూలు(న్యూసిటీ), జనవరి 21:** ప్రపంచంలో భూతల స్వర్గం అనదగిన సోషలిస్టు రాజ్యాన్ని నిర్మించిన మహా నేత లెనిన్ చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోతారని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. స్థానిక సుర్జిత్‌సింగ్ భవన్‌లో ఆదివారం లెనిన్ శత వర్ధంతి ప్రారంభ సభ విజయ్ అధ్యక్షతన నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారీ సమాజంలో కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి 1917లో కార్మిక రాజ్యాన్ని మొట్టమొదటిగా నిర్మించిన మహానేత విజయ్ లెనిన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి రాజశేఖర్, సభ్యులు అబ్దుల్లా, రామక్రిష్ణ, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక సుందరయ్య భవన్‌లో లెనిన్ శతవర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. లెనిన్ గొప్ప సిద్ధాంతవేత్త అని, కార్యదక్షుడని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ కే. ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్రకమిటీ సభ్యురాలు పి. నిర్మల కొనియాడారు. జారిస్టు రష్యాని సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్‌గా రూపాంతరం చేయించి ప్రపంచ చరిత్రలో నూతన శకానికి నాంది పలికిన విప్లవ మేధావి లెనిన్ అన్నారు. వ ఈ కార్యక్రమంలో టి.రాముడు, నరసింహులు, సుధాకరప్ప, ప్రభాకర్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

● లెనిన్ శతవర్ధంతిని పురస్కరించుకుని కార్మిక కర్షక భవన్‌లో ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డా.శంకర్‌శర్మ లెనిన్ జీవితం-కృషి అనే ప్రత్యేక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ వ్యక్తులలో లెనిన్ ఒకరన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ కే.ప్రభాకర్‌రెడి, ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డా.లక్ష్మీనారాయణ, జి.మధు, పానుగంటి చంద్రయ్య పాల్గొన్నారు.

● సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున అధ్వర్యంలో లెనిన్ శతవర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శేషఫణి, కే. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● ప్రపంచ వ్యాప్తంగా అసమానతలు లేని రాజ్యస్థాపనకై జరిగే పోరాటాలకు స్ఫూర్తి వీఐ లెనిన్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య అన్నారు. ఆదివారం నగరంలోని రాజ్‌విహార్ కూడలిలో సీపీఐ అధ్వర్యంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం మాట్లాడారు. కార్యక్రమంలో మహేష్, చంద్రశేఖర్, భీసన్న, కుమార్, నాగరాజు, అన్వర్, నల్లన్న, గిడ్డమ్మ, ఈశ్వర్, సోమన్న, కుమార్, రామచంద్ర, మహబూబ్, కృష్ణ, బాలయ్య, సురేంద్ర, వీరయ్య, మునిస్వామి, రాము, జయరాముడు, మహిళా నాయకురాళ్లు అమీనాబీ, సులోచనమ్మ, శైలజ పాల్గొన్నారు.


లెనిన్ ప్రత్యేక క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డా. శంకర్‌శర్మ


లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

# ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

## కరువు మండలంగా ప్రకటించాలి

**తుగ్గలి, జనవరి 21:** తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని టీడీపీ నాయకులు బాలన్న, లక్ష్మణస్వామియాదవ్, రవియాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని జొన్నగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ఏడాది సాగుచేసిన పంటలు అప్పులే మిగిల్చాయని, కరువు మండలంగా ప్రకటిస్తే కనీసం వచ్చే ఏడాది పంటల సాగుకు సహాయమైనా దక్కేదన్నారు. ఎన్ని విధాలుగా ఆందోళనలు, ధర్నాలు చేపట్టినా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, కరువు మండలంగా ప్రకటించకపోతే రైతులు పూర్తిగా నష్టపోతారని పేర్కొన్నారు.

## వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

**ఆలూరు రూరల్, జనవరి 21 :** వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని మాజీ ఎమ్మెల్యే, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ విద్యుత్, ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారం వేయడం తగదన్నారు. చెత్తపన్ను వేసిన ముఖ్యమంత్రిగా జగన్ నిలిచారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బడుగు, బలహీనవర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇంటికి వెళ్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబుకు వస్తున్న ఆదరణ చూసి జగన్‌రెడ్డి, భయం పట్టుకుందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు మళ్లీ చంద్రబాబు నాయుడు పాలన కోరుతున్నారని చెప్పారు.

## ఇంటింటికి అయోధ్య రామయ్య అక్షింతలు

**తుగ్గలి,జనవరి 21:** అయోధ్యరామయ్య అక్షింతలను ప్రతి ఇంటికి అందించాలని సొసైటీ సీఈవో గిడ్డయ్య, భజన బృందం సభ్యులు తెలిపారు. ఆదివారం మండలంలోని జొన్నగిరిలో భజన మండలి గౌరవ అధ్యక్షుడు తంబుల విరుపాక్షేశ్వరస్వామి ఆధ్వర్యంలో మేళతాళాలతో ప్రతి ఇంటికి అక్షింతలు అందించారు.

## వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించొద్దు

**మద్దికెర, జనవరి 21:** మండలంలో వ్యవసాయ తోటలకు, బోర్లకు మీటర్లు బిగించే విధానాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు, మాజీ కార్యదర్శి మదనంతపురం పాపన్న, హనుమన్న అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రైతులకు వ్యవసాయం కలిసి రాక అప్పుల పాలయ్యారన్నారు. గత ప్రభుత్వాలు ఉచిత విద్యుత్ అందిస్తూ ఉంటే ప్రస్తుతం మీటర్లు బిగిస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బోర్లకు మీటర్లను తగిలిస్తే పగలగొడుతామని హెచ్చరించారు.


## 'ఏఈవోల పదోన్నతి కోసం పోరాడుతాం'

**మంత్రాలయం, జనవరి 21:** రాష్ట్రంలో పని చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవోల) పదోన్నతుల కోసం పోరాటం చేసి సాధించుకుంటామని ఏఈవోల రాష్ట్ర అధ్యక్షుడు డీవీ వేణుమాధవరావు అన్నారు. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థం మంత్రాలయానికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను పోరాటం చేసి సాధించుకుంటామని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వానికి నివేదికలు పంపినా ఎన్నికల ముందు పదోన్నతులు ఇస్తామని కమిషనర్ హరికిరణ్ అంగీకారం తెలిపారన్నారు. అనంతరం రాఘవేంద్ర స్వామి నిజ బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రాలయం వచ్చిన ఏఈవోల రాష్ట్ర అధ్యక్షుడువేణుమాధవరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి సుభానిని మంత్రాలయం ఏఈవో నరసింహులు శాలువ, పుష్పగుచ్ఛం, రాఘవేంద్రస్వామి మెమెంటో ఇచ్చి సన్మానించారు.

## ఘనంగా సుంకప్ప తాత ఉరుసు

**మంత్రాలయం, జనవరి 21:** మంత్రాలయంలోని నాగులదిన్నె రోడ్డులో వెలసిన సుంకప్ప తాత (వన్నూరసవలి) దర్గా ఉరుసును ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం సుంకప్పతాత దర్గా పీఠాధిపతి ఖాజాహుశేన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్గాను వివిధ రకాల విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించి దర్గాను పట్టువస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు, జెండాను ఆవిష్కరించారు. ఉరుసు మహోత్సవాలకు వచ్చిన ప్రముఖులను పీఠాధిపతి ఖాజాహుశేన్ శాలువ కప్పి సన్మానించారు. ముల్లాసాబ్, రహంతుల్లా, మౌలా, షేక్షావలి, చాంద్, సాబువలి, రజాక్, రఫీక్, హజరత్, అమీన్‌బాషా పాల్గొన్నారు.

## ఏకశిల శ్రీరాముని విగ్రహ ఏర్పాట్ల పరిశీలన



శ్రీరాముని విగ్రహ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మఠం అధికారులు

**మంత్రాలయం, జనవరి 21:** మంత్రాలయం రాఘవరాయుల చెంత 59 అడుగుల భారీ ఏకశిల విగ్రహాన్ని మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు పూజలు చేసి ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సోమవారం అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేయనున్న నేపథ్యంలో మంత్రాలయంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఏకశిల శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ ఏర్పాట్లను ఆదివారం మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం ఈఈ సురేష్ కోనాపూర్, విగ్రహ శిల్పి ప్రముఖ అశోక్ గుడిధార్ పరిశీలించారు. శ్రీరాముని ఏకశిల విగ్రహానికి పీఠాధిపతి హారతులు ఇచ్చేందుకు భక్తులు, అర్చకులు, పీఠాధిపతి ఎక్కేందుకు ఏర్పాట్ల స్థలాన్ని పరిశీలించారు. అభయ శ్రీరామ ట్రస్టు అధ్యక్షులు బెంగళూరు చెందిన కృష్ణమూర్తి, కార్యదర్శి ద్వారకానాథ్, కోశాధికారి హరీష్ పలు సూచనలు ఇచ్చారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పదెకరాల్లో రూ.10 కోట్లతో చేపట్టిన శ్రీరాముని ఏకశిల విగ్రహావిష్కరణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేపట్టినట్లు శ్రీమఠం అధికారులు తెలిపారు. ఉదయం శ్రీమఠం నుంచి వేల సంఖ్యలో శ్రీరామున్ని 3 కి.మీ.ల మేర గ్రామాల చుట్టూ ఊరేగించి పీఠాధిపతులు హారతులు ఇవ్వనున్నారు.

## సీతారాముల విగ్రహాల ఊరేగింపు



రాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

**గోనెగండ్ల, జనవరి 21:** మండలంలోని హెచ్‌కైరవాడి గ్రామంలో ఆదివారం సాయంత్రం భక్త జన బృందం, భజన బృంధం ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల గుండా సీతారామాంజనేయ ఉత్సవ విగ్రహాలను మేళ తాళాలతో వైభవంగా ఊరేగించారు. ఊరేగింపులో కార్యక్రమంలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

## మద్దికెరలో ర్యాలీ



మద్దికెరలో సీతారాముల లక్ష్మణ చిత్రపటం ర్యాలీ

**మద్దికెర, జనవరి 21:** మద్దికెర రామమయంగా మారింది. అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని ఆదివారం అన్ని హిందూ సంఘాలు రామస్వామి గుడిలోని సీతారామ లక్ష్మణ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను, సీతారామ లక్ష్మణ చిత్రపటాలను పెట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. సీతారామ లక్ష్మణల ఉత్సవ విగ్రహాలకు ప్రజలు అడుగడుగునా హారతులు ఇచ్చి పూజలు చేశారు.

# సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదు

## అంగన్‌వాడీల సమ్మెకు పోలీసుల నోటీసులు



ఆదోనిలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు నోటీసులు ఇస్తున్న పోలీసులు



మంత్రాలయంలో జగన్‌ను సీఎం చేసి తప్పులు చేశామని చెంపలు వాయించుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



ఆస్పరిలో అంగన్‌వాడీలను అరెస్టు చేసిన పోలీసులు



ఎమ్మిగనూరులో అంగన్‌వాడీ కార్యకర్తకు నోటీసు అందజేస్తున్న పోలీసులు

**ఆదోని, జనవరి 21 :** సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. ఆదివారానికి సమ్మె 41 రోజుకు చేరింది. అంగన్‌వాడీల పోలీసులు నోటీసులు ఇవ్వడం ఏమిటని సీఐటీయూ నాయకులు లలిత, పద్మావతి, మంజుల, ఏఐటీయూసీ నుంచి శంకరమ్మ, రేణుక, శాంతి, గీత, వెంకటలక్ష్మీ ప్రశ్నించారు. సీఎం క్యాంప్ ఆఫీసును ముట్టడిని జయప్రదం కాకుండా పోలీసులు నోటీసులు ద్వారా అడ్డుకోవడం చాలా దారుణమన్నారు. ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలనే ఐదు సంవత్సరాల నుండి అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నాడని వాపోయారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రధాన కార్యదర్శి కే వెంకటమ్మ, రామాంజనేయులు, అంగన్‌వాడీ వర్కర్లు రిజ్వానా, సరోజ, గీత, రేణుక, సుజాత, మీనాకుమారి, ఉమ, ఆంథోనమ్మ, శారద, ఈరమ్మ పాల్గొన్నారు.

**ఆలూరు రూరల్:** అంగన్‌వాడీలపై కనికరం లేని ముఖ్యమంత్రి జగన్‌కు వచ్చే ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చూపిస్తారని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కేపీ నారాయణ స్వామి, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ మరియు హెల్పర్స్ యూనియన్ నాయకురాలు జయశ్రీ, బాలరంగమ్మ, ప్రభావతి అన్నారు. ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో చేపడుతున్న అంగన్‌వాడీల 41వ రోజు సమ్మె సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంబెడ్కర్ సర్కిల్లో 41 ఆకారంలో కూర్చొని నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు క్రిష్ణ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు భారతి, లక్ష్మి, సరస్వతి, సుజాత, వెంకటలక్ష్మి, ఆలూరు ప్రాజెక్ట్ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సమ్మెలో పాల్గొన్నారు.

**ఆస్పరి:** వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చమని అడిగితే తమను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకురాలు ప్రమీళమ్మ, జ్యోతి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కృష్ణమూర్తి, సీఐటీయూసీ మండల కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ సోమవారం జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు నాయకులను వెళ్లనీయకుండా అడ్డుకోవడం అన్యాయమన్నారు.

**పత్తికొండటౌన్:** సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు స్పష్టం చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వీర్యం చేసేందుకు పోలీసులు ఆదివారం ముందస్తు అరెస్టు చేశారు. స్థానిక సీఐటీయూ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, కాశీవిశ్వనాథ్‌కు పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చి అరెస్టు చేశారు.

**మంత్రాలయం:** వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారని అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు విశాలాక్ష్మి, భీమేశ్వరి, ప్రమీళ, లావణ్యలు అన్నారు. ఆదివారం మంత్రాలయం ఐసీడీఎస్ కార్యాలయం ముందు జగన్ రెడ్డిని సీఎంగా గెలిపించుకుని తప్పులు చేశామని చెంపలు వాయించుకుని నిరసన తెలిపారు. 41 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం తమ బాధలను పట్టించుకోవడం లేదని వాపోయారు. సమ్మెలో మాధురి, నరసమ్మ, తులసమ్మ, ద్రాక్షాయణి, ధనలక్ష్మి, శాంతమ్మ, భాగ్యమ్మ, మీనాక్షి, నాగవేణి, అయ్యమ్మ, భారతి, అనిత, సుజాత పాల్గొన్నారు.

### పోలీసుల అదుపులో అంగన్‌వాడీలు

చలో విజయవాడ వెళ్లేందుకు సిద్ధమైన అంగన్‌వాడీ వర్కర్లను మంత్రాలయం, మాధవరం ఎస్‌ఐలు వేణుగోపాల్‌రాజు, కిరణ్‌బాబు అదుపులోకి తీసుకున్నారు. విజయవాడకు వెళితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆదివారం రాత్రి అంగన్‌వాడీలకు పోలీసులు నోటీసులు జారీ చేసి పది మందిని పోలీస్ స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. అంగన్‌వాడీలు మాట్లాడుతూ ఉద్యమాలను అరెస్టులతో ఆపలేరని హెచ్చరించారు. తమ న్యాయమైన సమస్యల కోసం పోరాటం చేస్తే పోలీసులు వెళ్లనీయకుండా అడ్డుకోవడం ఏమిటని, తాము ఏమి తప్పు చేశామని ప్రశ్నించారు.

**ఎమ్మిగనూరు:** పట్టణంలో ఆదివారం రాత్రి అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆదివారం రాత్రి పోలీసులు నోటీసులు అందజేశారు. ధర్నాకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతి లేదని, ధర్నాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు అంగన్‌వాడీ కార్యకర్తలను హెచ్చరించారు. అంగన్‌వాడీలకు పోలీసులు నోటీసులు ఇవ్వడం పట్ల ప్రజా సంఘాలు మండిపడ్డాయి. సమస్యలు పరిష్కరించకుండా భయంభ్రాంతులకు గురి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

# అవినీతిపరులు రాజ్యమేలుతున్నారు

● మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి



ఒంటెడుదిన్నెలో శిథిలావస్థకు చేరిన పాఠశాలను చూపుతున్న బీవీ

**గోనెగండ్ల, జనవరి 21:** ఏపీలో అవినీతి ముఖ్యమంత్రి, అసమర్థ ఎమ్మెల్యేలు రాజ్యమేలుతున్నారని, అందుచేత రాష్ట్రం అభివృద్ధిలో వెనకపడి పోయిందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గోనెగండ్లలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్లె నిద్రలో భాగంగా గోనెగండ్లలో రాత్రి బస చేశారు. అంతకు ముందు పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఎగుర వేశారు. మొట్టి వీధిలో మహిళలతో మాట్లాడారు. అలాగే ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే చంద్రబాబు చేసే అభివృద్ధి పనుల గురించి వివరించారు. గ్రామ ప్రధాన కూడలి బస్టాండ్ సమీపంలో బీవీ ప్రసంగిస్తూ బీసీలను తీవ్ర అన్యాయం చేసిన పార్టీ వైసీపీ అని వారన్నారు. బీసీల ప్రేమ ఎన్నికల సమయంలో మాత్రమే సీఎం జగన్‌కు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి గుర్తుకు వస్తాయా? అని ప్రశ్నించారు. రాష్ట్రం ఇసుక, గ్రానైట్, గంజాయి మాఫియాలకు కేంద్రంగా మారిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరుపతయ్యనాయుడు, మేజర్ సర్పంచ్ హైమావతి, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, గోనెగండ్ల రమేష్‌నాయుడు, బారతం రహంతుల్లా, రంగస్వామినాయుడు, రఫీక్, నూరహమ్మద్, ఫకృద్దీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఒంటెడుదిన్నెలో:** ఒంటెడుదిన్నె గ్రామంలో శనివారం రాత్రి బస చేసిన అనంతరం ఆదివారం ఉదయం పలు వీధుల్లో బీవీ జయనాగేశ్వర రెడ్డి పర్యటించారు. యువత, మహిళలు, రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అధికార వైసీపీ హయాంలో నిరుద్యోగులు ఉపాధి లేక వారు పడుతున్న బాధలను బీవీ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామస్థులు తాగునీరు, సీసీరోడ్డు, డ్రైనేజి ఇతర సమస్యలను ప్రజలు బీవీ దృష్టికి తీసుకువచ్చారు. ఆ సమస్యలను ప్రభుత్వం రాగాను పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలను ఆయన పరిశీలించారు. పాఠశాల శిథిలావస్థకు చేరిందని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అర్థం కాని పరస్థితి ఏర్పడిందని అన్నారు. అనంతరం టీపీడబ్ల్యూ చేపట్టిన పలు కార్యక్రమాలకు సంబంధించిన బుక్‌లెట్‌ను సభ్యులు బీవీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. రమేష్‌ఆచారి, శివన్న, సభ్యులు ప్రవీణ్, వెంకటరమణనాయుడు, శివరామ్, రాజు, వోసన్న, రామానాయుడు, వినోద్ పాల్గొన్నారు.

## టీడీపీలో చేరిన సంగాల గ్రామస్థులు



టీడీపీలో చేరిన నాయకులు

**పత్తికొండ, జనవరి 21 :** మండలంలోని సంగాల గ్రామానికి చెందిన 15 కుటుంబాలు నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామ నాయకులు మహేష్, ఎర్రగోటు మాదన్న నేతృత్వంలో నడపి గిడ్డయ్య, టైలర్ రాజు, కోయిలకొండ భాస్కర్, దాసు, గచ్చిరాజేష్, ఎద్దుపెంట బాలక్రిష్ణ, తిక్కబగ్గి, కత్తికర్ణ, రామచంద్రుడు, కత్తి అబ్రోజ్, కత్తివిజయ్, మల్లికార్జునతోపాటు వారి కుటుంబ సభ్యులు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువాకప్పి కేఈ శ్యాంబాబు పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండలకన్వీనర్ మద్రిశ్రీరాములు, గురుస్వామిలు ఉన్నారు.

## సెబ్ సీఐ బదిలీ

**ఎమ్మిగనూరు, జనవరి 21:** సెబ్ ఎమ్మిగనూరు స్టేషన్ సీఐ జయరామ్ నాయుడు అన్నమయ్య జిల్లా మైదుకూరుకు బదిలీ అయ్యారు. ఎన్నికలు సమీపిస్తుండటం, దీర్ఘకాలికంగా పని చేస్తున్న పోలీసు అధికారులను ప్రభుత్వం బదిలీలు చేస్తోంది. ఇందులో భాగంగానే సీఐ జయరామ్ నాయుడును మైదుకూరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సత్యసాయి జిల్లా మడకశిర సెబ్ సీఐగా పనిచేస్తున్న భార్గవ్ రెడ్డిని ఎమ్మిగనూరు సెబ్ సీఐగా బదిలీ చేశారు. వీరు ఒకటి రెండు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నారు. అలాగే ఎమ్మిగనూరు సెబ్ ఎస్ఐ పనిచేస్తున్న సోమశేఖర్ రావు డోన్‌కు బదిలీ అయ్యారు.

## రాజ్యాధికారం కోసం పోరాడాలి



మాట్లాడుతున్న కోదండ

**ఆదోని(అగ్రికల్చర్), జనవరి 21 :** బహుజనులంతా ఐక్యమత్యంగా రాజ్యాధికారం కోసం పోరాడాలని సీపీఐఎస్ఐ (డీబీఎస్‌వీ) జాతీయ కార్యదర్శి పగడాల కోదండ, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు అన్నారు. ఆదివారం కమ్యూనిస్టు పార్టీ దళిత బహుజన శ్రామిక విముక్తి పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి మారోజు వీరన్న 62వ జయంతిని భీమాస్ హాలులో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రాజకీయ పార్టీలు ఓటర్లను మోసం చేస్తూ, ఓటును నోటుతో కాజేస్తున్నారని ఆరోపించారు. మా ఓటు మా కులాన్ని మేము పాలించుకుంటామని అన్నారు. కార్యక్రమంలో రమేష్, పాండురంగ, హరీష్ బొజ్జన్న, నాగరాజ్, పవన్, లక్ష్మారెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

## ఇళ్ల కుంభకోణంపై త్రిసభ్య కమిటీ ఏర్పాటు

**పత్తికొండటౌన్, జనవరి 21:** పట్టణంలో వైఎస్ రాజారెడ్డి నగర్‌లో ఇళ్ల కుంభకోణంపై నిజనిజాలు నిగ్గు తేల్చాలని కలెక్టర్ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసినట్లు అడ్వకేట్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రాంతినాయుడు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాజారెడ్డి నగర్ పేరిట ఇళ్ల కుంభకోణంపై లోకాయుక్తను ఆశ్రయించానని అన్నారు. లోకాయుక్త ఫిబ్రవరి 8వ తేదీ లోగా రాజారెడ్డి నగర్‌లో జరిగిన అవకతవకలపై పూర్తి వివరాలను తెలపాలని, లోకాయుక్తా ఆర్డర్‌ను జారీ చేసిందని ఆయన తెలిపారు. త్రిసభ్య కమిటీ ద్వారా రాజారెడ్డి నగర్ పట్టాదారులకు న్యాయం జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆరుగురి అరెస్టు

**ఆదోని రూరల్ జనవరి 21 :** పేకాట ఆడుతున్న ఆదోని పట్టణానికి చెందిన ఆరుగురిని పెద్దతుంబళం పోలీసులు అరెస్టు చేసి రూ.8వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం దొడ్డనగేరి గ్రామ శివార్లలో ఓ పంట పొలంలో పేకాట ఆడుతుండడంతో దాడులు నిర్వహించి ఆరుమందిని అదుపులో తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ పీరయ్య తెలిపారు.

● ఆదోని మండలం అలసందగుత్తి గ్రామానికి చెందిన రామాంజనేయులు అనే వ్యక్తి ఆదివారం తన ఇంట్లో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తుండగా, పోలీసులు అదుపులో తీసుకున్నారు. అతని వద్ద నుంచి 50 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ ఎర్రిస్వామి తెలిపారు.

## అచ్చెన్నాయుడిని కలిసిన చోళే మల్లికార్జున



**ఎమ్మిగనూరు, జనవరి 21:** ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ప్రముఖ ఫెర్టిలైజర్ వ్యాపారి, వీరశైవ లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన చోళే మల్లికార్జున రెండు రోజుల క్రితం మంగళగిరిలో టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన తన ప్రొఫైల్‌ను ఇవ్వటంతో పాటు ఎమ్మిగనూరు బీసీలకు కేటాయిస్తే నా అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరినట్లు మల్లి కార్జున తెలిపారు. త్వరలో టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబును కలుస్తున్నట్లు తెలిపారు. మల్లికార్జున వెంట ఆయన కుమారుడు మంజు ఉన్నారు. రాబిన్ శర్మ టీం ద్వారా వీరు అచ్చెన్నాయుడిని కలిసినట్లు తెలిసింది.

## కులగణనను బహిష్కరిస్తున్నాం

● మాదాసి కురువ సంఘం



మాట్లాడుతున్న నాగరాజ్ గౌడ్

**ఆదోని టౌన్, జనవరి 21:** ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను తాము బహిష్కరిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మాదాసి కురువ, మాదారి కురువ, ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజ్ గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కులగణన విషయంలో ఆయా కులస్తులు మౌఖికంగా సూచించిన కులాన్ని నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ కూడా, అలా చేయడం లేదని ఆరోపించారు. తమను బీసీ-బీ కింద పరిగణిస్తున్న కురుబ కులం కింద నమోదు చస్తామని చెప్పడం ఏమాత్రం సరికాదన్నారు. ఫలితంగా మాదాసి కురువలు అన్యాయానికి గురికావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లకు తాము దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. అధికారుల తీరును నిరసిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా మాదాసి కురువ, మాదారి కురువలు కులగణనలో పాల్గొనకుండా బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు బసవరాజు, పెద్దహరివాణం నాగరాజు, మండల ఉపాధ్యక్షుడు ముఖేష్, నాగలాపురం గ్రామ అధ్యక్షుడు ఉరుకుంద, మల్లికార్జున, గర్జప్ప, లింగరాజు పాల్గొన్నారు.

**మద్దికెర:** కులగణన సర్వేను మదాసి, మదారి కురువలు బహిష్కరిస్తామని తెలిపారు. ఆదివారం మండలంలోని పెరవలి గ్రామంలో మదాసి, మదారి కురువ సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురువ సంఘం నాయకులు మాట్లాడుతూ అధికారులు కులగణన సర్వే చేస్తున్నారని, సర్వేలో మదారి, మదాసి కురుభలు నమోదు చేయకుండా కురువలుగా నమోదు చేయాలని చూస్తున్నారని, ఇది చాలా అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన సర్వేలో 31వ లైన్‌లో మదారి కురువ, కురువ ఎస్సీలుగా ఉన్నాయని, అక్కడ మమ్మల్ని నమోదు చేయకుండా బీసీలుగా నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు.

## కుల గణనలో ఆస్తుల వివరాలు ఎందుకు?



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

**మద్దికెర, జనవరి 21:** మండలంలో రెండు రోజుల నుంచి చేస్తున్న కులగణన సర్వేలో ఆస్తుల వివరాలు ఎందుకంటూ మాజీ జడ్పీటీసీ జమేదార్ రాజన్నయాదవ్, జిల్లా సాధికారిక సభ్యుడు లక్ష్మీనారాయణ, జిల్లా టీడీపీ మాజీ కార్యదర్శి ఉప్పరి రంగయ్య అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కులగణన సర్వే స్వాగతిస్తున్నామని, అయితే ప్రజల ఆస్తుల వివరాలు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగన్నరేళ్లు దాటి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ ప్రక్రియ ఎన్నికల ముందు చేయడం పట్ల పలు అనుమానాలు రేకెస్తున్నాయన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఉప కులాల వివరాలు తెలుసుకోవడం మంచిదేనని, అయితే కులగణన పేరుతో ప్రత్యర్థులను గుర్తించి దెబ్బ కొట్టాలన్న ఉద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఎన్నికల ముందు వలంటీర్లతో కులగణన చేయించడం వెనుక వైసీపీ కుంతత్ర రాజకీయాలు దాగి ఉన్నాయన్నారు. ప్రభుత్వం తప్పుడు ఆలోచనలను మానుకుని కులగణన సక్రమైన రీతిలో చేయాలన్నారు. కులగణనలో 14 నిబంధనలు పెట్టడం మంచిది కాదన్నారు. ఆస్తుల వివరాలతో మీకు ఏమి పని ఉంటుందని ప్రశ్నించారు. కులగణన సర్వేలో ఎలాంటి అవకతవకలు జరిగినా ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## ఆలూరు మార్కెట్ యార్డు రెగ్యులర్ కార్యదర్శిగా సునీత



**ఆలూరు, జనవరి 21 :** ఆలూరు వ్యవసాయ మార్కెట్ యార్డుకు రెగ్యులర్ కార్యదర్శిగా సునీత నియామకం అయ్యారు. మార్కెట్ యార్డును అభివృద్ధి చేసి ఆదాయం సమకూరేలా చేస్తానన్నారు. మంత్రి జయరాం, చైర్మన్ గుమ్మనూరు నారాయణ సహకారంతో అభివృద్ధికి ప్రణాళిక చేస్తానన్నారు.

## పత్తికొండ బరిలో నిలుస్తాం

**పత్తికొండటౌన్, జనవరి 21:** పత్తికొండ ప్రాంతంలో మరింత సేవ చేయాలంటే ప్రజాప్రతినిధి కావాల్సిందేనని, అందుకే వచ్చే ఎన్నికలలో నియోజకవర్గం నుంచి బరిలో నిలుస్తామని వైసీపీ సీనియర్ నాయకులు, కేడీసీసీ బ్యాంక్ మాజీ వైస్‌చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ అన్నారు. ఆదివారం స్థానిక సాయిబాబా దేవాలయంలో ఉచిత కంటి, గుండె, కిడ్నీ మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రామచంద్రారెడ్డి, నాగరత్నమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు దామోదరాచారి, పందికోన మల్లికార్జున, శ్రీకాంత్‌రెడ్డి, కాశాస్త్రీ సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ దేశాలకు మార్గదర్శి లెనిన్



పత్తికొండలో లెనిన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

**పత్తికొండ టౌన్, జనవరి 21:** కార్మికవర్గ విముక్తి కోసం పోరాడి రష్యాలో సోషలిస్టు కార్మిక రాజ్యాన్ని స్థాపించిన మహనీయుడు లెనిన్ ప్రపంచ దేశాలకు మార్గదర్శి అని ఆయన ఆశయ సాధన కోసం ముం దుకు సాగుదామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. లెనిన్ శత వర్ధంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజినేయులు, మండల కార్యదర్శి రాజాసాహెబ్, ప్రజా సంఘాల నాయకులు తిమ్మయ్య, గురుదాసు, సురేంద్రకుమార్, కృష్ణ, నెట్టికంటయ్య, ఉమామహేశ్వరరావు, అనుమేష్ పాల్గొన్నారు.

## 'లెనిన్ అడుగు జాడల్లో నడవాలి'

**ఎమ్మిగనూరు రూరల్, జనవరి 21:** ఎమ్మిగనూరు పట్టణంలో ఆదివారం సోషలిస్టు రాజ్యా నిర్మాత లెనిన్ శత వర్ధంతిని సీపీఐ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీపీఐ నాయకులు సోమప్ప సర్కిల్‌లో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే సీపీఐ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీపీఐ, సీపీఐఎంఎల్ నాయకులు పంపనగౌడ్, రంగన్న, రాజు, ప్రసాద్, మహేంద్రబాబు, సమీవుల్లా, మల్లికార్జునగౌడ్, ఖాజ, వీరేష్, శాంతప్ప, హరికృష్ణనాయుడు, భాస్కర్, తిమ్మగురుడు పాల్గొన్నారు.

**వెల్దుర్తి :** పట్టణంలో స్థానిక కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) కార్యాలయంలో ఆదివారం మండల కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మార్క్సిజం ద్వారా రష్యాలో సోషలిస్టు రాజ్యాన్ని తెచ్చిన గొప్పనాయకుడన్నారు. కార్యక్రమంలో మాధవస్వామి, రాజు, చిన్నమాదులు, అనిల్, వీరన్నలు పాల్గొన్నారు.